క్లుప్తంగా

రెండో ఎంఈఓల బాధ్యతల స్వీకరణ


ఎం.శోభనాద్రి


పాతపాటి వెంకటరత్నం

పొదలకూరు : మండల రెండో విద్యాశాఖాధికారిగా ఎం.శోభనాద్రి స్థానిక ఎమ్మార్సీ భవన్లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సైదాపురం మండలం ఊటుకూరు జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. మొదటి ఎంఈఓగా ముత్తుకూరు ఎంఈఓ మధుసూదన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

బుచ్చిరెడ్డిపాళెం: మండల రెండో విద్యాశాఖాధికారిగా మండలంలోని పెనుబల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాతపాటి వెంకటరత్నం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా, బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి

• నివాళులర్పించిన మంత్రి కాకాణి


రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాకాణి

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పెద్ద రామయ్య(75)ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం కంటేపల్లిలోని రామయ్య నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకాణి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కనుపూరు కోదండరామిరెడ్డి, మందల వెంకటశేషయ్య, రాచాల రవికుమార్, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, వెలిబోయిన వెంకటేశ్వర్లు, తుపాకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు



ముత్తుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ మధుసూదన అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళెం అంగన్‌వాడీ కేంద్రం నుంచి 17 మంది పిల్లలు సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఒక్కరు కూడా ప్రయివేటు స్కూళ్లలో చేరకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితాంబ, పాఠశాల హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు కృష్ణకుమార్, పర్వీన్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


కామాక్షి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధ తాళలేక వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఉడ్‌హౌస్‌సంఘంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..ఉడ్‌హౌస్‌సంఘంలో వెంకట సుబ్బయ్య, కామాక్షి(52) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. సుబ్బయ్య బేల్దారి పనులు, కామాక్షి టిఫిన్ అంగడి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుమారుడికి మతిస్థిమితం సరిగాలేదు. కామాక్షి సైతం అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అప్పులు చేసి మరీ చికిత్స చేయించుకుంటున్నారు. కుమార్తెకు వివాహం చేయడంతో మరింత అప్పులపాలయ్యారు. అప్పట్నుంచి కామాక్షి అప్పుల విషయమై తన అక్క పద్మకు చెప్పి బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం సుబ్బయ్య పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కామాక్షి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఈ విషయాన్ని ఆమె తన అక్క పద్మకు ఫోనుచేసి చెప్పింది. పద్మ హుటాహుటిన చెల్లెలు ఇంటివద్దకు చేరుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న కామాక్షిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించి సుబ్బయ్యకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కామాక్షి కొద్దిసేపటికే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి భర్త నవాబుపేట పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై కే తిరుపతయ్య ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

• 30 వరకు చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు
• ఆర్బీఎస్కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్


అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యాధికారులు

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆర్బీఎస్కే(రాష్ట్రీయ బాల స్వస్థ్య) ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్వీ.సుధీర్ కుమార్ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ప్రాంగణంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లోని 40 మంది చిన్నారులకు సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పది మంది చిన్నారులకు ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను వైద్య నిపుణులు పరీక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. బరువు, ఎత్తు తక్కువగా ఉండడం, రక్తహీనత, గ్రహణమొర్రి, గుండు సమస్యలున్న చిన్నారులను గుర్తించి నెల్లూరు డైస్ సెంటర్‌కు పంపుతామని తెలిపారు. అక్కడ చిన్నారులకు సకల వసతులతో మెరుగైన వైద్యం అందించి ఆరోగ్యం మెరుగు పడ్డాక తిరిగి పంపిస్తారని చెప్పారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను పరీక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చిన్న పిల్లల వైద్య నిపుణులను నియమించినట్లు వెల్లడించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ వైద్య నిపుణులు వచ్చినప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలన్నారు. ప్రతి చిన్నారి పరీక్షలకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు వెన్నెల, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి


వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. అలాగే అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకుంటే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారిని కూడా వలంటీర్లు గుర్తించి స్థానిక సచివాలయాల్లో అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

నేడు ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయం అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పల్లకి సేవ ఉంటుందని చెప్పారు.

కామాక్షితాయి సేవలో కేంద్ర ఆడిట్ జీఎం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఇళంగోవన్ కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని విజయవాడకు చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర ఆడిట్ జనరల్ మేనేజర్ ఇళంగోవన్ తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. తొలుత గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం


బుచ్చిరెడ్డిపాళెం: సత్కారం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు


కొడవలూరు: విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కింద పాఠశాలలో సోమవారం సత్కరించి, నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్ర ప్రభుత్వం సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనివల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి ఉన్నత విద్యలో మరింత ప్రతిభను కనపరుస్తారని తెలిపారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన అక్షయకు రూ.3 వేల నగదు, గోల్డ్‌మెడల్, రెండో స్థానంలో నిలిచిన బాలాజీకి రూ.2 వేల నగదు, సిల్వర్ మెడల్, మూడో స్థానంలో నిలిచిన మనీషాకు రూ.వెయ్యి నగదు, ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నాగ సుబ్బారెడ్డి, మస్తానయ్య, కృష్ణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తగిన ప్రోత్సాహం

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లోని విద్యార్థులను తగిన విధంగా ప్రోత్సహిస్తోందని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన రామలింగయ్య పేర్కొన్నారు. పది పరీక్షల ఫలితాల్లో పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన జయచంద్ర, రుషినాథసింగ్, సుధీర్‌లకు 'జగనన్న ఆణిముత్యాలు' కింద నగదు పురస్కారాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని చదువులో బాగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్.తిరుమలయ్య, సీఆర్పీ ఎం.దయాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేబాల వద్ద రోడ్డు ప్రమాదం


గాయపడిన లారీ డ్రైవర్ బాషా


గాయపడిన క్లీనర్ ప్రతాప్

• ఇద్దరికి తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నంద్యాల నుంచి నెల్లూరు వైపు వస్తున్న లారీ రేబాల వద్ద ఆగింది. అనంతరం లారీ డ్రైవర్ షేక్.బాషా, క్లీనర్ ప్రతాప్ లారీ దిగి రోడ్డు పక్కన నిలబడి ఉండగా బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వైపు అతివేగంగా వస్తున్న బైక్ వారిని బలంగా ఢీకొంది. అనంతరం పక్కనే ఉన్న పొలాల్లో బైక్ పడింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి ఏమీ కాలేదు. అయితే రోడ్డు డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. అయితే దీనిపై పోలీసులకు సమాచారం అందలేదు.

డిగ్రీ పరీక్షలకు 670 మంది గైర్హాజరు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన 670 మంది విద్యార్థులు సోమవారం జరిగిన 4, 6వ సెమిస్టర్ పరీక్షలకు గైర్హాజరైనట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆర్.ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షకు 631 మంది, మ, ధ్యాహ్నం జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షకు 39 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మొత్తం ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు.

హెచ్‌ఎంకు ప్రశంసా పత్రం


'Lifestyle for the Environment' Pledge
Certificate
This is to certify that

కొడవలూరు : కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, నీతి ఆయోగ్ సంయుక్తంగా 'లైఫ్‌స్టైల్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై ఆన్‌లైన్‌లో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో హెచ్‌ఎంకు ఆన్‌లైన్‌లో సోమవారం ప్రశంసా పత్రం పంపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

అమెరికాలో వీరంపల్లి యువకుడి మృతి

• గ్రామంలో విషాదఛాయలు


సుమన్‌రెడ్డి (ఫైల్)

మనుబోలు : మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అమెరికాలోని అట్లాంటాలో సోమవారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం మేరకు.. వీరంపల్లి గ్రామానికి చెందిన పంటా రామచంద్రారెడ్డి–పరమేశ్వరమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మనోహర్‌రెడ్డి గ్రామంలోనే వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు సుమన్‌రెడ్డి(32) ఏడాది క్రితం అమెరికా వెళ్లి అట్లాంటాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సుమన్ మూడు రోజుల క్రితం హైబీపీకి గురై బాత్‌రూమ్‌లో పడిపోయినట్లు తెలిసింది. ఆపై బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో స్నేహితులు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో వీరంపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ జెట్టి సురేందర్‌రెడ్డి సుమన్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. సుమన్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

• తహసీల్దార్ వీరవసంతరావు


వినతిపత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదలకూరు : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాల్సిందిగా సూచించారు. అధికారులు ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సూచించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ డి.నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి పంచాయతీ నాగంబొట్లకండ్రిగకు చెందిన ఓ వివాహిత భర్త దాడిలో గాయపడి తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెద్ద పెంచలయ్య–కామేశ్వరి దంపతులు. ఈనెల 15వ తేదీన మద్యం మత్తులో పెంచలయ్య తన భార్య కామేశ్వరి(27)పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను తొలుత నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు మగ పిల్లలు సంతానం. భర్త పెద్ద పెంచలయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఆర్‌ఆర్‌నగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శైలు (32) అనే వివాహిత సోమవారం వేకువన మృతి చెందింది. ఆర్‌ఆర్‌నగర్ వద్ద కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోతో పాటు మరో రెండు బైక్‌లను ఢీకొన్న విషయం విదితమే. ఇందులో రెండో బైక్‌పై ఉన్న రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా అదే బైక్‌లో ఉన్న శైలుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీర ప్రతాప్ తెలిపారు.